పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## ప్రజలకు తక్కువ ధరకే అందించాలని లక్ష్యంతో ఔషధి కేంద్రాన్ని ప్రారంభం గంటా



**భీమిలి, పెన్ పవర్, జూన్ 4 :**మండలంలోని పందలపాక ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ 56 వ బెటాలియన్ లో ఏర్పాటు చేసిన జన ఔషధి కేంద్రాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన జనరిక్ మందులను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. తక్కువ ధరలో లభించే ఈ మందులకు విస్తృత ప్రాచుర్యం కల్పించాలని చెప్పారు. అంతకు ముందు బోర్డర్ పోలీస్ ఫోర్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. జనరిక్ మందులను పంపిణీ చేశారు. డిఐజి పి.కె. అగర్వాల్, కమాండెంట్ హరిసింగ్, స్థానిక నాయకులు బి.ఆర్.బి.నాయుడు, తాట్రాజు అప్పారావు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, బమ్మిడి ఉమ, కాకర రమణ, కర్రోతు సత్యనారాయణ, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు





- డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి
- అధికారులతో సమీక్షించిన జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్
- జిల్లాలో నేటి నుంచి 12 కేంద్రాల్లో పరీక్షలు, హాజరుకానున్న అభ్యర్థులు ..

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, జూన్ 04 :**జూన్ 06 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, పక్కా చర్యలు చేపట్టాలని సంబం ధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె. మ యూర్ అశోక్ ఆదేశించారు. ఈ మేరకు బుధవా రం తన ఛాంబర్లో ఏర్పాట్లపై సంబంధిత అధికా రులతో సమీక్షించారు. జిల్లాలో 12 కేంద్రాల్లో పరీక్షల జరగనున్న నేపథ్యంలో సమన్వయం వహించాలని, ఎక్కడా చిన్నపాటి లోపం కూడా తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ షెడ్యూల్ ఉంటుందని, సుమారు 57,895 మంది దరఖాస్తు చేసుకు న్నారని తెలిపారు. జిల్లాలో కొమ్మాది చైతన్య ఇంజనీ రింగ్ కాలేజ్, పెద గంట్యాడ ఎస్.వి.ఎస్. సొల్యూషన్స్, షీలా నగర్, చినముషిడివాడ-1, 2 ఐయాన్ డిజిటల్ సెంటర్లు, ఎన్ఎస్టీఎల్ సమీపంలోని ఏడీజడ్ ఆర్వోనా డిజిటల్, మధురువాడ, రుషికొండ గాయిత్రీ విద్యా పరిషత్, దువ్వాడ విజ్ఞాన్, కాపు జగ్గరాజుపేట విజ్ఞాన్, శొంఠ్యాం ఎన్.ఎస్.ఆర్.ఐ.టి., నర్వా విట్స్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆన్లైన్ విధానంలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంట లు వరకు రెండు పూటలా పరీక్ష జరుగుతుంద న్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరుకావాలని, హాల్ టిక్కెట్‌తో పాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించా రు.పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని జేసీ ఆదేశించారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక ఛీఫ్ సూపరింటిండెంట్, సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటు లో ఉంచాలని, నిరంతర విద్యుత్ సరఫరా, హైస్పీడ్ నెట్ సదుపాయం ఉండాలని ఆదేశిం చారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా అదనపు బస్సులను నడపాలని ఆర్టిసి అధికారులకు సూచించారు. సంబంధి త ధృవీకరణ పత్రాల ఆధారంగా హాల్ టిక్కెట్లపై ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, ఎస్.ఎస్.ఎ. పీవో చంద్రశే ఖర్, డీఎం%డ%హెచ్వో జగదీశ్వరరావు, ఆర్టీసీ, విద్యుత్, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ ఏడాది సూపరిపాలన పురస్కరించుకుని వేడుకలు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్ 4:**కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం,రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జీకే వీధి మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి ఉత్సాహంగా జరిపారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి జనసేన మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, జనసేన ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి, మండల టీడీపి అధ్యక్షులు ముక్కలి రమేష్ బాబు, సీనియర్ నాయకులు పాండురాజు, ఎంపీటీసీ సభ్యులు పసుపు లేటి నాగమణి, ముక్కలి కళ్యాణి, పొత్తూరు కొండలరావు, భూపతి, ముక్కలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తరఫున మండల అధ్యక్షులు కాకూరి శేఖర్, బోండ్ల చిరంజీవి, కిరణ్ తదితరులు హాజరయ్యారు. జనసేన పార్టీ నుంచి సోషల్ మీడియా ఐటీ ఇంచార్జ్ కొయ్యం ఇమ్మానుయేల్ (సిద్దు), గడుతూరి పరమేశ్వరరావు, మధు, పాంగి శ్రీను, విరోజీ త్రిమూర్తులు, గడుతూరి రమణబాబు, రాట జోత్స్న, ఉల్లం ఈశ్వరరావు, కోటేశ్వరరావు, బాబురావు, రాజు, పాడల్ వీరన్న, పాడల్ బాబీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొర్లె వీర వెంకట్ మాట్లాడుతూ కూటమి నాయకత్వం వృద్ధి చెందాలని, ప్రజలకు మరింత సేవ చేసే దిశగా పయనించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కూటమి చేపట్టిన మార్గం అభినందనీయమని వ్యాఖ్యానించారు.

## వెన్నుపోటు దినం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ





### జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం

**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, జూన్ 4 :**ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజ లకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి చంద్రబా బు చేసిన మోసాలు,అరాచకాలు, అన్యా యాలపై వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు దక్షిణ, తూర్పు నియోజ కవర్గం సమన్వయక ర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మొల్లి అప్పా రావు ఆధ్వర్యంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విశాఖప ట్నం జిల్లా పరిషత్తు జంక్షన్ నుండి జిల్లా కలెక్టర్ల వారి కార్యాలయం కు బుధ వారం ఉదయం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సంద ర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ఆనాడు ఎన్టీఆర్ ను వెన్నుపోటు పొడిచి దొడ్డిదారిలో ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు ఈరోజు ఎన్నికల ముం దు అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టి ఇచ్చిన హామీలను నెరవేర్చ కుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆయన ఆరోపించారు. అధికారం చేపట్టిన నాటి నుండి వైసీపీ నాయకులను, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అనేక రకాలుగా కేసులు బనా యించి అరాచక పాలన సాగిస్తూ సంవత్సరం గడిపేసారని, ప్రజల సంక్షేమం కోసం ఏనాడు పట్టించుకోవడం లేదని అన్నారు వచ్చే ఎన్నికల్లో వీటి అన్నిటికీ తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబు రావు,శాసనమండలి సభ్యురాలు మరియు వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, మాజీఎమ్మెల్యే లు, సమన్వయకర్తల, కార్పొరేటర్లు, మాజీకార్పొ రేటర్లు, వార్డు అధ్యక్షులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు,సభ్యులు, రాష్ట్ర,పార్లమెంట్,సిటీ నాయకులు,మహిళా విభాగం నాయకులు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## జంతు హింసా నివారణ చట్టాలపై గోడ పత్రికను ఆవిష్కరించిన

జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం జూన్ 4 :** జంతు హింసా నివారణ చట్టాలపై రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రా ప్రదేశ్ గోవధ నిషేధ చట్టం మరియు పశు సంరక్షణ చట్టం 1977, జంతు హింసా నివారణ చట్టం 1960, జంతు వధ నిబంధనలు 2010, జంతు రవాణా చట్టం 1978 మొదలగు జంతు సంరక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించా లని పశు సంవర్ధక శాఖ మరియు నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించా లని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలని, చట్ట ఉల్లంఘన చేసిన వారి పట్ల కఠిన చర్యలు తీసు కోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా.కరుణాకర్ ఉప సంచాలకులు డా.చంద్ర శేఖర్ అసిస్టెంట్ డైరెక్టర్లు డా.శ్రీనివాస్, డా.మాదిన ప్రసాదరావు నగర పాలన సంస్థ సిటీ వెటర్నరీ ఆఫీసర్ డా.కిషోర్ పాల్గొన్నారు.

## "కునుకూరు" గ్రామానికి త్రాగునీటి సౌకర్యం...!



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 4:**మండలంలోని, మారుమూల బూదరాళ్లపంచాయితీ పరిధిలో కునుకూరు (పీవీటిజి వీధి)గ్రామంలో బుధవారం స్థానిక సర్పంచి ఆధ్వర్యంలో కొళాయిలు ప్రారంభించడం జరిగింది. స్వతంత్రం వచ్చి నేటికి కునుకూరు పివీటిజి వీధిలో రక్షిత మంచినీటి సదుపాయం లేక 1కిలో మీటర్ దూరం నుండి కలుషిత ఊటనీటిని సేకరించి, సేవించడం వలన వ్యాధుల బారిన పడి ఎంత మందో గిరిజనులు అనారోగ్యంతో బాధపడి మరణించడం జరిగింది. ఇది తెలుసుకున్న సర్పంచ్ స్వచ్ఛంద సంస్థను కోరగా స్పందించి మంచినీటి కుళాయిలను చేకూర్చారు.సర్పంచి సాగిన ముత్యాలమ్మ, వార్డ్ మెంబర్ సంజీవ్ ప్రత్యేక చొరవ తీసుకొని బేస్ సంస్థ ప్రతినిధులతోమాట్లాడి, బోర్ వెల్ తీయించడం జరిగింది. దానిని పంచాయితీ నిధులతో గ్రామానికి డైరెక్ట్ పంపింగ్ ద్వారా 12 కొళాయిలతో రక్షిత మంచినీటి సదుపాయం కల్పించినందువల్ల గ్రామస్తులు సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డ్ సభ్యులు సంజీవ్ లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వావార్డ్ సభ్యులు సంజీవ్, సత్యవతి, కునుకూరు అంగన్వాడీ టీచర్, ఆయా మరియు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి చేస్తున్నందుకా వెన్నుపోటు దినం

- ఆంధ్రుల జీవనాడి పోలవరాన్ని పట్టాలెక్కించి నందుకా
- మేనిఫెస్టో అమలుపై చర్చకు సిద్ధమా
- వైసీపీకి గంటా సవాల్



**,స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం,జూన్ 4 :**మేనిఫెస్టో హామీల అమలుపై జర్నలిస్టుల సమక్షంలో చర్చకు సిద్ధమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వైసీపీకి సవాల్ విసిరారు. ఎం.వి.పి. కాలనీలోని నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వా న్ని.. హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిన జగన్మోహన్ రెడ్డి తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 2019 మేనిఫెస్టోలో చెప్పిన మద్య నిషేధం, ప్రతి ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ వంటి అనేక హామీలు అమలు చేయకుండా అయిదేళ్లు గడిపేశారని, 2024 లో 11 సీట్లకు పరిమితం చేస్తూ ఇచ్చిన ఫలితంతో జగన్ మైండ్ బ్లాంక్ అయ్యి ప్రజల తీర్పు సైతం అపహాస్యం చేసేలా దిగజారి మాట్లాడుతున్నార ని అన్నారు. బ్లాంక్ అయిన మైండ్ ను సెట్ చేసుకుని జనం మధ్యలోకి వచ్చేలా చేయాలని దేవుడిని కోరుకుంటున్నానని చెప్పారు. బాధ్య త గల రాజకీయ పార్టీగా ప్రజాతీర్పును విశ్లేషిం చుకుని పొరపాట్లు సరిదిద్దుకోవాలని సలహా ఇచ్చారు. తల్లి, చెల్లి పట్ల వ్యవహరిస్తున్న తీరు తోనే జగన్ జపించే నైతిక విలువల విలువెంతో ప్రజలకు తెలిసిందన్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా కుమారుడి వైఖరిని విడిపోయారని, అధికారంలోకి వచ్చాక తండ్రి సమకాలికుడైన చంద్రబాబును జగన్ అవమా నించిన తీరును సామాన్య ప్రజానీకం మరచి పోలేదని తెలియజేశారు. చంద్రబాబు సీఎంగా ఉండడం ఆంధ్రుల అదృష్టమని ఢిల్లీలో రాజశే ఖర్ రెడ్డి షాపింగ్ కు వెళ్లినప్పుడు చెప్పారని, దేశంలో చంద్రబాబుకున్న గౌరవ, ప్రతిష్టలకు ఇదో ఉదాహరణని వివరించారు. అధికారంలో ఉండగా స్టీల్ ప్లాంట్ సమస్యపై పిల్లి మొగ్గలు వేసి.. ప్రైవేటీకరణ ప్రతిపాదనకు పరోక్షంగా సహకరించారని ఆరోపించారు,అభివృద్ధి చేస్తున్నందుకా వెన్నుపోటు దినం?కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి ఊపందుకుందని గంటా చెప్పారు. వైసీపీ హయంలో ఏపీ గుంతలకు కేరాఫ్ అడ్రస్ గా ఉండేదని, కూటమి హయంలో 50 వేల గుంతలు పూడ్చామని, వేల కిలోమీటర్ల పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, మున్సిపల్ రోడ్లు వేశామని తెలిపారు. "వైసీపీ స్మశానంగా మార్చిన అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చి దిద్దుతున్నందుకా? ఆంధ్రుల జీవనాడి పోలవరాన్ని పట్టాలెక్కించినందుకా? రైల్వే జోన్ సాధించి పనులు ప్రారంభించినందు కా? మెట్రో రైల్ కు రూ.17,232 కోట్లతో డీపీఆర్ తయారు చేసి ముందుకు వెళ్తున్నందుకా? విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ.14,400 కోట్ల ప్యాకేజీ తీసుకువచ్చినందుకా? దేనికి వెన్నుపోటు దినం పిలుపిచ్చారని" ఆయన వైసీపీ నాయకులను నిలదీశారు.అధికారం చేపట్టిన రోజునే 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్.. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ.. ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు.. రూ.3 వేల పెన్షన్ రూ.4 వేలకు పెంపు.. దస్త్రాలపై ముఖ్యమంత్రి సంతకాలు చేశారని గుర్తు చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ మొదలైందని, మహిళలకు ఉచిత బస్సును ఆగస్టు 15. నుంచి ప్రారంభిస్తామన్నారు. ఈనెల 12 నుంచి తల్లికి వందనం.. రైతులకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. చరిత్రలో లేని విధంగా కూటమి పార్టీలు 55.30 శాతం ఓట్లతో 94 శాతం సీట్లు సాధించాయని అన్నారు. జగన్మోహన్ రెడ్డి మళ్లీ గెలిస్తే రాష్ట్రానికి.. ప్రజలకు.. నష్టమనే భయంతో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు 95 వేలు.. భీమిలిలో తనకు 93 వేలు.. మంగళగిరిలో 91 వేల భారీ మెజారిటీలు ఇచ్చారని తెలిపారు. 6 శాతం సీట్లు తెచ్చుకున్న వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదని, హోదా ఇవ్వలేదని ఏడాదిగా జగన్ అసెంబ్లీకి రాలేదన్నారు.

ఈ సమావేశంలో కార్పొరేటర్లు పి.వి.నరసిం హం, లొడగల అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి గంగా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, జనసేన నాయకుడు శాఖారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# "వెన్నుపోటు దినం" సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ







**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు /గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 4:** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేసిందంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 4న "వెన్నుపోటు దినం" గా నిరసన కార్యక్రమం నిర్వహించారు.పాడేరు శాసనసభ్యులు మరియు అల్లూరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ కార్యక్రమం క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా సాగింది. అనంతరం డీఆర్వో పద్మలత కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, "ఎన్నికల ముందు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలతో ప్రజలను మభ్యపెట్టిన చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంగా ఒక్క హామీను కూడా అమలు చేయకుండా మోసపూరిత పాలన కొనసాగిస్తోంది" అని ఆరోపించారు.అయితే గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో గిరిజన ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి పనులు %-% రోడ్లు, త్రాగునీటి సరఫరా, సంక్షేమ పథకాలు వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి సాధించామని, ప్రజల సాక్షిగా వాస్తవం పేర్కొన్నారు.చంద్రబాబు నాయుడు మోసాలు, అన్యాయాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవాస్తవమైన ఫిలాసఫీలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "ప్రజలు తమ భవిష్యత్తు మెరుగుపరచాలనే ఆశతో అధికారాన్ని అప్పగిస్తారు, కానీ ఈ ప్రభుత్వం వారి ఆశలకు విరుద్ధంగా పనిచేస్తోంది" అన్నారు.ఈ కార్యక్రమంలో
జి.మాడుగుల జడ్పీటీసీ సభ్యురాలు మత్స్యరాస వెంకట లక్ష్మీ,చింతపల్లి జడ్పీటీసీ సభ్యులు పోతురాజు బాలయ్య,చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి,జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి,పాడేరు మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు,జీకే వీధి వైసీపీ అధ్యక్షులు గిరి ప్రసాద్,జి. మాడుగుల మండల అధ్యక్షులు ఎన్.మత్యకొండం నాయుడు, కొయ్యూరు మండల పార్టీ అధ్యక్షులు బి. అప్పారావు, చింతపల్లి మండల పార్టీ అధ్యక్షులు పాంగి గణబాబు, రాష్ట్ర మరియు జిల్లా నియోజకవర్గాల అనుబంధ విభాగాల నాయకులు,రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ఆశల్ని విస్మరించిన ప్రభుత్వానికి గట్టి సందేశం వెళ్లిందని, హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ప్రజల తీర్పు తప్పక వుంటుందని నేతలు హెచ్చరించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు.

- జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ కె.వి.ఎస్ పద్మావతి.



**గుమ్మలక్ష్మీపురం జూన్ 4 పెన్ పవర్.** మండలం లో గల తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ కె.వి.ఎస్ పద్మావతి తనికిచేసారు. ఈ సందర్భంగా.
రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.
ఎనీమియా యాక్షన్ కమిటీ మీటింగ్ ప్రతినెల మొదటి బుధవారం మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల ప్రతి సచివాలయంలో తప్పనిసరిగా జరిగేలా చూడాలన్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలని, అబా ఐడి క్రియేట్ చేయాలని ఆమె సూచించారు మరియు
అన్ని ఇండికేటర్స్ శాతం తక్కువగా ఉంది ఇంప్లిమెంటేషన్ ఉండాలని.
క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వే పక్కగా చేపట్టి జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని. డాక్టర్ కె.వి.ఎస్ పద్మావతి అన్నారు
ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బుద్దేస్. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం నిరసన ర్యాలీకి 13 వ వార్డు మద్దతు

నిరసన ర్యాలీగా కదలిన 13 వ వార్డు వైసిపి నాయకులు మహిళలు కార్యకర్తలు






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూన్ 4:** వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కేకే రాజు. తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపుమేరకు 13వ వార్డు సత్యాల సాగరిక ఆధ్వర్యంలో నగరంలో తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీకి మద్దతుగా 13వ వార్డు నుండి అధిక సంఖ్యలో వైఎస్ఆర్సిపి నాయకులు మహిళా విభాగాల నాయకురాలు కార్యకర్తలు అభిమానులు ప్రజలు తరలి వచ్చారు. ముందుగా ఆఖరి బస్టాప్ వద్దగల వైయస్సార్ విగ్రహానికి పాలాభిషేకం పూల మాలలు వేసి ర్యాలీగా తరలి చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు హామీలు ఇచ్చి వాటిని గాలికి వదిలేసి చేసిన మోసాలు,అరాచకాలు, ఆన్యాయాలపై వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా పరిషత్తు జంక్షన్ నుండి జిల్లా కలెక్టర్ల వారి కార్యాలయం కు వెన్నుపోటు దినం అని నిరసన ర్యాలి జరిగింది.ద్విచక్ర వాహనాలు ఆటోలు పలు వాహనాలలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ 13,11,12 10 9 వార్డుల మీదగా జిల్లా పరిషత్ వరకు కొనసాగింది. అనంతరం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు

## గిరిజనుల గ్రామాల్ని సందర్శించిన బత్తుల



**అనకాపల్లి, పెన్ పవర్ జూన్ 4:** అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ జీలుగులోవ గ్రామాన్ని సందర్శించిన రాష్ట్ర హౌసింగ్ కార్పరేషన్ చైర్మన్ %ఽ% అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు
గిరిజనులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు
కూటమి ప్రభుత్వంలో విద్యుత్ సౌకర్యం కల్గడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేసారు.
గిరిజనులు రోడ్ల సౌకర్యం మరియు త్రాగునీరు కోరగా, ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్ళి త్వరలో సమస్యలును పరిష్కరిస్తామని భరోసా.
ఈ కార్యక్రమంలో రావికమతం మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు బద్రి చినబ్బాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

## హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించిన డిఎంహెచ్వో డాక్టర్ జమాల్ బాషా





**హుకుంపేట పెన్ పవర్ జూన్4** హుకుంపేట ఆరోగ్య కేంద్రంలో అల్లూరి డిఎంహెచ్వో డాక్టర్ జమల భాష. హుకుంపేట ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ సౌజన్య తో మాట్లాడుతూ ప్రతిరోజు వచ్చే ఓపి ని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ యొక్క సీజన్ లో వచ్చే వ్యాధులు మలేరియా, టైఫాయిడ్ టిబి వంటి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని మరియు అన్ని పరీక్షలు తప్పనిసరిగా. జరగాలని వైద్య సిబ్బందిని సూచించారు తర్వాత టీబీ వ్యాధి సంబంధించి 100 ప్రోగ్రాంలో ప్రతి పంచాయతీ గ్రామాలలో కఫం, పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే కోట్నాపల్లి పంచాయతీ లో మరియు పెదగరువు గ్రామంలో గర్భిణీ స్త్రీలతొ మాట్లాడుతూ ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సరైనటువంటి పౌష్టికాహారం ఆకుకూరలు పాలు, గుడ్లు, చెక్కిళ్ళు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాంలో చిన్న పిల్లల టీ కాలు గురించి అంగన్వాడి సెంటర్లో పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడాది సంబరాల పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు





**అనకాపల్లి, పెన్ పవర్, జూన్ 4:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసిన సందర్భంగా మునగపాక గ్రామం నందీశ్వరుని ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ హాజరయ్యారు.
రాష్ట్రానికి అరిష్టం పోయి ఏడాదైనా రోజు సందర్భంగా ప్రకృతి విఘాతకుడు పులివెందుల ఎమ్మెల్యే
వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలన కనుమరుగైన రోజు అని తెలిపారు.తల్లిని, చెల్లిని , ఓటేసిన ప్రజలను వంచించిన నయవంచకుడుకి చరమగీతం పలికిన రోజు అని
ఐదు కోట్ల ఆంధ్రులు ఊపిరి పీల్చుకున్న రోజు. దేశంలోనే వెన్నుపోటుదారుడు ఎవరైనా ఉన్నారంటే అది ఒక జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని ధ్వజమెత్తారు.
గత ఐదేళ్లలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా జగన్ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారు.బాబాయిని చంపి పిన్నికి చెల్లికి వెన్నుపోటు పొడిచారు అని
జగన్ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పడడంతో ప్రజలు జగన్ కు 11 సీట్లకే పరిమితం అయ్యారని ఏద్దావా చేశారు.
రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచి ఇప్పుడు వెన్నుపోటు దినమని జగన్ బయటకు వస్తున్నారు అని.నరేంద్ర మోడీ చంద్రన్న పాలనకు డిప్యూటీ.సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన ప్రతి హామీను నెరవేర్చుకుంటూ. వస్తున్నారు అని ఎలమంచిలి నియోజకవర్గంలో అచ్చుతాపురం నుండి అనకాపల్లి వెళ్లే రోడ్లు హాస్పిటల్స్ కాలువలు ఫంక్షన్స్. గ్రామాల్లో డ్రైనేజీలు అభివృద్ధి చేశాం అని తెలిపారు. ఎలమంచిలి నియోజకవర్గంలో ఓటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కోరారు. ముగ్గుల పోటీలు, తప్పిడుగుల్లు, బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం, దొడ్డి శ్రీనివాసరావు, కే చంద్రమోహన్, ఏవి సత్యనారాయణ, ఎం ఆనంద్, ఎల్లపు సంతోష్ కుమార్, పల్లి నర్సింగరావు, సూరిశెట్టి అప్పలనాయుడు, పెద్దలు జనసేన టిడిపి బిజెపి నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు తదిరులు పాల్గొన్నారు..

## కూటమి ప్రభుత్వ సంవత్సర పాలన విజయవంతం

మోదీ, చంద్రబాబు, పవన్‌కి పాలాభిషేకం





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 4:** కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలనలోకి తీసుకొని ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గూడెం కొత్తవీధిలో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా కూటమి నేతలు ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం నుండి కోలుకొని తర్వాత రాష్ట్రాన్ని నిలదొక్కుకునే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం అనేక పెట్టుబడులను ఆకర్షించిందన్నారు. పారదర్శక పాలనతో అభివృద్ధి మార్గదర్శకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. అభివృద్ధిని కాదని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు తప్పుల ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. "వైసీపీ నాయకులకు బాధ్యతతో స్పందించడం తెలియదు. గతంలోనే చట్టాలు ఉల్లంఘించిన వారే ఇప్పుడు మేము మాట్లాడినా సమస్య అంటున్నారు," అని విమర్శించారు.వైసీపీ ప్రభుత్వం కాలంలో గంజాయి మాఫియా, రౌడీషీటర్ల పెంపుదల, దళితులపై అణచివేతలు జరిగాయని అన్నారు. "ఇప్పుడు ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వానికి ఎన్ని అడ్డంకులు ఉన్నా, అభివృద్ధి పథంలో వేగంగా ప్రయాణిస్తోంది. గిరిజన గ్రామాల్లో రోడ్లు, మంచినీటి పథకాలు, ఇళ్లు వంటి మౌలిక వసతులు అందిస్తున్నాం," అని కూటమి నేతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్, జనసేన నాయకులు కొయ్యం బాలు,వీర వెంకట్,నాయకులు చిరంజీవి,నళిని,పసుపులేటి నాగమణి, రామకృష్ణ, కళ్యాణి రామారావు, కొండలరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.భారీగా జనసైనికులు, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

## రేషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్4:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీలో రేషన్ పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొని పరిశీలించారు. రేషన్ డిపో వద్ద రేషన్ కార్డుదారులకు నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంటాయని ప్రతి నెల ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ డీలర్ అందుబాటులో ఉంటారని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే నడవలేని వృద్ధులకు 65 సంవత్సరాలు పైబడిన వారికి నేరుగా ఇంటి వద్దకే రేషన్ తీసుకొని వచ్చి ఇవ్వటం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తురు కొండలరావు, జనసేన పార్టీ నాయకులు అరడా కోటేశ్వరరావు, వనపల ఈశ్వరరావు, టిడిపి బూత్ ఇంచార్జ్ ముర్ల భూపతి, వీఆర్వో అచ్చిబాబు,సేల్స్ మేన్ మడపల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమికి అధికారం ఇచ్చినందుకు వెన్నుపోటు పొడిచారు



గాజువాకలో వెన్నుపోటు దినం చేపట్టిన వైసీపీ



**గాజువాక: పెన్ పవర్, జూన్ 04**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. పాత గాజువాక జంక్షన్ నుండి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యుడు తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ హామీలను భూతద్దంలో చూపించి ప్రజలను మోసం చేసిన చంద్రబాబును నమ్మే స్థితిలో లేరన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్మోహన్ రెడ్డి పని చేశారని తెలిపారు. ఒంటరిగా పోటీ చేస్తే గెలవడం కష్టమని భావించి బీజేపీ,జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్క పథకాన్ని అమలు చేయని అసమర్థుడిగా నిలిచారని ఎద్దేవా చేశారు. ప్రజల నుంచి తిరుగుబాటు రాకముందే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ చింతలపూడి వెంకటరామయ్య,రాష్ట్ర నాయకులు ఉరుకూటి అప్పారావు,కార్పొరేటర్లు ఉరుకూటి చందు,భూపతిరాజు సుజాత,మహ్మద్ ఇమ్రాన్,పల్లా చినతల్లి,ధర్మాల శ్రీనివాస్,గౌస్,నాగేంద్ర,వార్డు అధ్యక్షుడు,జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీపై పాముకాటు



**గుమ్మలక్ష్మీపురం జూన్ 4.పెన్ పవర్:**బాలేసు గ్రామంలో ఉపాధి హామీ కూలి పై పాముకాటు వేసింది. బాలేసు పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కీలక దాసు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఉపాధి పనికి వెళ్లిన తోయక దామి(55)అనే మహిళపై ఈ సంఘటన జరిగింది ఈ సందర్భంగా విలేకరులతో ఫీల్డ్ అసిస్టెంట్ మాట్లాడుతూ. రోజు లాగానే బుధవారం ఉదయం ఉపాధి పనికి అందరూ బయలుదేరారు పని మొదలుపెటిన ఆ కొద్దిసేపటికే పొదల్లో నుంచి వచ్చిన పాము ఆమెను కాటు వేసిందని. ఆమెను హుటాహుటిన రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య నిమిత్తం ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లాలని ఆయన అన్నారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రమాదం ఏమీ లేదని వైద్యులు చెప్పారని ఫీల్డ్ అసిస్టెంట్ మీడియాకు తెలిపారు. అలాగే దాసు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఎమర్జెన్సీ కిట్లు ఏర్పాటు చేయాలని అలాగే సేద తీరేందుకు తార్పోలిన్ కూడా ఏర్పాట్లు చేయాలని.కావున సంబంధిత అధికారులు కూలీలపై దృష్టి సారించి తక్షణమే ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు కోరరు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 4:**కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరవేస్తూ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బిజెపి మండల అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పద్మరాజు అధ్యక్షతన మండల పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలను రూపొందించి అమలుపరుస్తుందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం దేశ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోది దేనన్నారు. మండలంలో పార్టీకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా ప్రతి నేత కార్యకర్తగా సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయి నుండే పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ విధి విధానాలపై సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు పద్మరాజు (నాని), సన్యాసిరావు, పార్టీ జిల్లా నేతలు మేడిబోయిన చక్రారావు(చిన్న ), గాలి దేముడు శరభయ్య అర్జున్ రెడ్డి దారకొండ త్రినాథ్ మండల సహాయ కార్యదర్శి చిన్నిరాజు, నాగేష్, సిద్ధు రాజవొమ్మంగి మండల బిజెపి మండల కార్యదర్శి శ్రీను తదితర పలువురు పాల్గొన్నారు.

## నయవంచనకు. హత్య రాజకీయాలకు. విధ్వంసాలకు. బ్రాండ్ అంబాసిడర్ వైఎస్ జగన్మోహన్ రెడ్డి-రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా విమర్శ





-ప్రజా తీర్పును గౌరవించలేని జగన్మోహన్ రెడ్డి రాజకీయాలక అనర్హుడు

**గాజువాక పెన్ పవర్, జూన్ 04:**తన అధికారం కోసం సొంత బాబాయ్ ని హత్య చేయించిన జగన్ మోహన్ రెడ్డి. కరుడుగట్టిన రౌడీలను తెనాలిలో పరామర్శించి తన నేర స్వభావాన్ని తన నేర స్వభావాన్ని మరొకసారి రాష్ట్ర ప్రజల దృష్టికి తీసుకొచ్చాడని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షతన విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం తీసుకువెళ్లిన టిడిపి అధినేత చంద్రబాబు అభినందనీయం అన్నారు . జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టిన తన వికృతమైన చర్యలపై ఆత్మ విమర్శ చేసుకోలేదని అన్నారు. రాష్ట్రంలో కూటమిపాలన ప్రజలు ప్రశాంతమైన జీవితాన్ని సాగిస్తున్నారని. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రధానమంత్రి మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో నవ్యాంధ్రప్రదేశ్ ను స్వర్ణాంధ్రప్రదేశ్ వైపు తీసుకుపోతామని అన్నారు. భవిష్యత్తులో జగన్మోహన్ రెడ్డి సింగల్ డిజిట్ కే పరిమితమైపోతాడని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి పుచ్చ విజయ్ కుమార్ రాష్ట్ర టిడిపి నాయకుడు చెరుకూరి నాగేశ్వరరావు. 66వ టిడిపి అధ్యక్షుడు గోమాడ వాసు. 73 వ టీడీపీ అధ్యక్షుడు సింగూరు అనంత్. గాజువాక నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు తమరి శివప్రసాద్. ప్రధాన కార్యదర్శి పోతున వెంకటరావు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తమ్మిని విజయకుమార్. జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్వర్ణపుడి రాంబాయి. జిల్లా పార్టీ కార్యదర్శిలు కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ. గంట అబ్బాయి. రాజన్ రాజు. సింగంపల్లి దేవుడు. కరణం ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును ఆశిస్తూ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు

## ఇచా ఫౌండేషన్ లో మానవత్వాన్ని చాటుకున్న సృష్టి వరల్డ్ స్కూల్.





**గాజువాక:పెన్ పవర్, జూన్ 04,** ఉక్కునగరం సృష్టి వరల్డ్ స్కూల్ డైరెక్టర్ పి సుశీల రాణి జన్మదినాన్ని పురస్కరించుకొని కొండకర్ల లోని' ఈచ' ఫౌండేషన్ లో ఆప్యాయతతో కూడిన సేవా కార్యక్రమాన్ని పాఠశాల నిర్వహించింది. అక్కడ ఉన్న అనాథలను, దివ్యాంగులను పరామర్శించి, ఆప్యాయంగా పలకరించి వారికి అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేఘన కంభం మరియు పాఠశాల సీఈవో అభిరామ్ హాజరయ్యారు. 30 సంవత్సరాల విద్యా ప్రయాణంలో ఈ కార్యక్రమం ఒక ప్రత్యేక ఘట్టంగా నిలిచిపోతుందని, కార్యక్రమంలో సుమారు 110 మంది సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం డైరెక్టర్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన విందును స్వీకరించారు. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతోపాటు, మానవీయ విలువలకు పాఠశాల ఎంతో ప్రాముఖ్యతను ఇస్తుంది అనడానికి ఈ కార్యక్రమం ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

## కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో సంబరాలు





- బంగారు మెట్ట పంచాయతీ కేంద్రంలో మహిళలకు ముగ్గుల పోటీలు.
- ముంచంగిపుట్టు మండల టీడిపి కార్యదర్శి కె జగత్రాయ్, జనసేనా మండల అధ్యక్షుడు ఆర్ శ్రావణ్ కుమార్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్04.**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మండల టీడిపి నాయకులు బుదవారం సంబరాలు చేసుకున్నారు. మండల టీడిపి కార్యదర్శి కొంతేరి జగత్ రాయ్, జనసేన మండల అధ్యక్షుడు ఆర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంలో మహిళలతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సుపరిపాలన మొదలైందన్నారు. "సుపరిపాలన మొదలై ఏడాది – పేద విరగడై ఏడాది" అనే కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బంగారుమెట్ట గ్రామ పంచాయతీ కేంద్రంలో సంక్రాంతి, దీపావళి తరహా పండుగలను గుర్తు చేసేలా ముగ్గుల పోటీలు నిర్వహించమన్నారు. రాష్ట్రంలో గత 5సంవత్సరాల అరాచక పాలన నుండి ప్రజలు విముక్తి చెంది, కూటమి ప్రభుత్వాన్ని అత్యధిక మెజారిటీతో ప్రజలు గెలిపించరన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఒక వెయ్యి 5కోట్లతో రోడ్ల నిర్మాణం, జలజీవన్ మిషన్ పథకంతో నీటి సమస్య పరిష్కారం, పీఎం జన్మన్ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి గృహాలను కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన ఉపాధ్యక్షులు కే చందు, కిలగాడ సర్పంచ్ కె శివశంకర్, అరకు పార్లమెంట్ కార్యదర్శి పి కామేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జి ఎం చిన్నిబాబు, జె ఎస్ పి ప్రధాన కార్యదర్శి పి మురళి, కార్యదర్శి హరిబందు, వైస్ సర్పంచ్ వి రామన్న, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## ఏడేళ్ల తర్వాత పంట కాల్వల పూడికతీతలు

- రూ. 99 లక్షలతో పంట కాల్వల పూడికతీత
- భీమిలి ఎమ్మెల్యే గంటా



**బిమిలి, పెన్ పవర్, జూన్ 4** :ఆయకట్టు స్థిరీకరించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చేయడం ద్వారా రైతులకు దన్నుగా ఉంటామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రూ. 7.99 లక్షల వ్యయంతో మండలంలోని గుడిలోవ కాలువ పూడికతీత పనులను బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. గత ప్రభుత్వం అయిదేళ్లలో కాలువల పూడికతీతకు ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయని పేర్కొన్నా రు. భీమిలి నియోజకవర్గంలో పంట కాల్వల నిర్వహణ కింద 15 పూడికతీత పనులకు రూ. 99.95 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపా రు. గిడిజాల గ్రామం నీళ్ల కుండీల నుంచి మొదలై పెద్దిపాలెం దత్తప్ప చెరువు వరకు 11.50 కిలో మీటర్ల పొడవున విస్తరించి ఉన్న గుడిలోవ కాలువ 600 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తుందని చెప్పారు. ఏడేళ్ల తర్వాత కాల్వ పూడికతీతలు జరుగుతున్నాయన్నారు. 57 కిలో మీటర్ల పొడవున కాల్వల పూడిక తీయడం ద్వారా 4,130 ఎకరాల ఆయ కట్టుకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఈ సందర్భంగా పూడికతీత పనులను గంటా పరిశీ లించారు.

ఈ కార్యక్రమంలో కూటమి నేతలు తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి.నాయుడు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, మీసాల సత్యనారాయణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఒరవడి లో చిత్రాన్ని నిర్మించి

- యువ దర్శకులు విజయవంతం కావాలి
- ప్రొడక్షన్ నెంబర్ 3 పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 4** :సినిమా రంగంలో నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న యువ దర్శకులు విజయవంతం కావాలని ప్రముఖ సినీ నిర్మాత, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆకాంక్షించారు.ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్టైన్మెంట్ నిర్మాణ సారథ్యంలో, ఆర్కే మీడియా హౌస్ సహ సమర్పణలో వైజాగ్ కి చెందిన యువ దర్శకుడు రత్నం రామ్ గోపాల్ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రొడక్షన్ నెంబర్ 3 చిత్రానికి సంబంధించిన పోస్టర్ని దక్షిణ నియో జకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ బుధవా రం నాడు ఆవిష్కరించారు. నూతన ఒరవడి లో చిత్రాన్ని నిర్మించి ఎంతోమంది యువ దర్శకు లు విజయవంతం అయ్యారని అదే కోవలో ఈ చిత్రం కూడా భారీ విజయవంతం అవుతుందని ఆశిస్తున్నానని ఆయన అన్నారు. కళాకారులకు వైజాగ్ పుట్టినిల్లు అని ఇక్కడ నుంచే ఎంతోమం ది దర్శకులు సాంకేతిక నిపుణులు రచయితలు సినిమా రంగం లో పేరు ప్రఖ్యాతలు తెచ్చుకు న్నారని అన్నారు..ఈ సందర్భంగా సినిమా బృందాన్ని అభినందించారు.

ఈ కార్యక్రమం లో చిత్ర దర్శకుడు రత్నం రామ్ గోపాల్, ఆర్కే మీడియా హౌస్ అధినేత బి.రవి కాంత్, సీనియర్ జర్నలిస్ట్ లఖినేని బాలకృష్ణ, కవి,రచయిత సత్తివాడ శ్రీకాంత్, సహాయ దర్శకుడు నాని,రిషి తదితరులు పాల్గొన్నారు.

## దేవరపల్లిలో టిడిపి నేతల సమావేశం- టిడిపి సంస్థగత ఎన్నికల తీర్మానాలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 4:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దేవరపల్లి పంచాయతీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఏడాది పాలన విజయవంతంగా ప్రజా సుపరిపాలన జరిగిన సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను కొనియాడుతూ పలువురు మాట్లాడారు. ఈ సమావేశంలో 16 పంచాయతీల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని పార్టీ అభివృద్ధి కొరకు పలు తీర్మానాలు చేసుకున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న పార్టీ సంస్థాగత ఎన్నికలు తెలుగుదేశం పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని తీర్మానించారు. అలాగే పాడేరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఆధ్వర్యంలో పార్టీ నియమించిన పరిశీలకుల ద్వారా జీకే వీధి మండల 16 పంచాయితీల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తల సమక్షంలో జీకే వీధి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుని ఎన్నిక జరగాలని తీర్మానించటం జరిగింది. ఈ కార్యక్రమంలో 16 పంచాయతీలకు సంబంధించి సుమారు 200 మంది కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్ర బలరాం, దేవరపల్లి సర్పంచ్ బుజ్జిబాబు, మాజీ మండల టిడిపి అధ్యక్షుడు మామిడి బాలయ్య పడల్, మాజీ ఉమ్మడి జిల్లా టిడిపి కార్యదర్శి ముక్కలి మహేష్, సీనియర్ నాయకులు గడుతూరి అప్పారావు, టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి ముక్కలి కళ్యాణి, బీసీ సెల్ నాయకులు బేరా రాజు బాబు, యూనిట్ బూత్ ఇంచార్జు మొట్టడం శరబన్న దొర, మామిడి చంటిబాబు,లకే రామారావు, సీనియర్ నాయకులు శెట్టి రామారావు, మొట్టడం రాంబాబు,కొర్ర కొండలరావు,కిల్లో గోపాల్, గడుతూరి వెంకటరావు, గుమ్మడి రాజబాబు, చిప్పాడ శాంతి బాబు, కంకిపాటి గోపాలరావు, తగ్గి సోమరాజు, గడుతూరి నాగేశ్వరరావు, మహిళా టిడిపి నాయకులు కొర్ర కృష్ణకుమారి, సిరిబాలా పద్మ, తూబెరి కుమారి, బూత్ ఇంచార్జ్ దేవరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సంపద సృష్టి అంటే ఉన్న ఉద్యోగాలను తొలగించడమా

- ప్రజల పై వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం
- వైసీపీ సీనియర్ నాయకుడు మోరి రవి



**చింతపల్లిపెన్ పవర్ జూన్ 4:**-ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కానీ హామీలతో ఓటర్లను మభ్యపెట్టి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గెలిచిన తరువాత ఓట్లేసి గెలిపించిన ఓటర్ల విశ్వాసాలపై వెన్నుపోటు పొడిచిందని వైసీపీ సీనియర్ నాయకుడు మోరి రవి అన్నారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన పేదలకు బాసటగా నిలిచి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల వద్దకే పాలన అందిస్తే అది జీర్ణించుకోలేని కొన్ని శక్తులు కూటమిగా ఏర్పడి నోటికొచ్చిన హామీలు గుప్పించి ఇప్పుడు మొఖం చాటేయడమే కాకుండా ప్రభుత్వ సేవలు ప్రజలకు దూరం చేస్తున్నాయని అన్నారు. మొన్న వాలంటరీ వ్యవస్థ రద్దుచేసి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షణలు చేసేలా చేసిన కూటమి ప్రభుత్వం నేడు ఎండియు వ్యవస్థ రద్దుచేసి ప్రజలపై కక్ష సాధింపు చర్యకు తెగ బడిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా! పారదర్శకంగా ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. మొన్న ఇచ్చిన ఫ్రీ గ్యాస్ ఎవరికి ఇచ్చారో! ఎవరికి లేదో! కూటమి నాయకులకే తెలియదని వ్యాఖ్యానించారు. ఎండియు వ్యవస్థ రద్దుతో వికలాంగులు, వృద్ధులకు ఇంటికి రేషన్ అందిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకులు ఎవరెవరికి ఇంటికే రేషన్ అందించనున్నారో! ఒక్క పేరు తెలియని స్థితిలో వారు ఉన్నారని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు పదిహేను వందలు, ఫ్రీ బస్సు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎక్కడా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో ఒక్క ఉద్యోగ నియామకం జరపక పోగా ఉన్న ఉద్యోగాలను ఊడదీసే కార్యక్రమం పెట్టుకుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానంలో సంపద సృష్టిస్తాను అని అంటే ఉన్న ఉద్యోగాలను తొలగించడం, ప్రజలకు ప్రభుత్వ సేవలు దూరం చేయడమేనని తెలియక ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో కూటమి పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

# ప్రజలను వెన్నుపోటు పొడవడంలో "జగన్" ని మించిన వాళ్లు లేరు



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 4 :** మండలంలోని నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని కూటమి నాయకులు పున ప్రారంభించారు. కొయ్యూరు గ్రామంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు.కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువుల డిపోను పునర్ ప్రారంభించడం జరిగింది కొయ్యూరు పంచాయతీలో 65 సంవత్సరములు పైబడిన వృద్ధులు 40 కుటుంబాలు ఉండగా వారికి
ఇంటింటికి వెళ్లి నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు మాట్లాడుతూ...
వైసిపి నాయకులు టిడిపి ప్రభుత్వం పై ఎటువంటి విమర్శలు చేయలేక వారు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఎటువంటి వెన్నుపోటు పొడిచారో అవి కూటమి ప్రభుత్వంపై పెట్టాలని చూస్తున్నారు.రాజధాని నిర్మాణం చేయలేక మూడు ముక్కల రాజధాని గా మార్చి భూములు ఇచ్చిన యావత్తు అమరావతి రైతులను వెన్నుపోటు పొడిచింది గొడ్డలి పోటు జగన్ గుంతల రోడ్ల రాష్ట్రంగా మార్చింది గొడ్డలి పోటు జగన్,దసలవారీగా మద్యాన్ని నివారిస్తామని చెప్పి కల్తీ మద్యాన్ని విచ్చలవిడిగా సరపర చేస్తూ ఎంతోమంది ప్రజల చావుకు కారణమైన వెన్నుపోటు జగన్,
అసెంబ్లీ సాక్షిగా మహిళలను అగౌరవపరిచి కౌరవ సభగా మార్చింది గొడ్డలి పోటు జగన్,
వైసిపి అధికారంలోకి రాకముందు పెన్షన్ 3000 రూపాయలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక పెంచుకుంటూ పోతాను అని ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్ కూటమి నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గొరపల్లి బాబులు పార్టివదేహానికి నివాళు లర్పించిన మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజు



**పెందుర్తి, పెన్ పవర్, జూన్ 4 :** స్థానిక పెందుర్తి మండలం, యస్ఆర్ పురం కేదారవానిపాలెంకు చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు గొరపల్లి బాబులు గుండెపోటుతో ఆకస్మిక మరణంచెందడంతో ఆయన పార్థివదేహానికి మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొరపల్లి బాబులు చనిపోవడం కుటుంబానికి మరియు పార్టీకి తీరనిలోటని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలోఅదీప్ రాజ్ తో పాటు ఎంపీపీ మధుపద నాగమణి అంజి, వాల్మీకి సర్పంచ్ బొడ్డు ప్రకాష్, వాలంటీర్ విభాగం అధ్యక్షులు అవగడ్డ శ్రీనివాస్ తదితరులున్నారు.

# నాతవరంలో సుపరిపాలనకు ఏడాది.. పండుగ చేసుకుందాం కార్యక్రమం.......









- బాణసంచా కాల్చి ఘనంగా కూటమి నాయకులు సంబరాలు......

**నాతవరం పెన్ పవర్ (జూన్ 04):** జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు నాతవరంలో బుధవారం సుపరిపాలనకు ఏడాది పండుగ చేసుకుందాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాతవరం బస్టాండ్ వద్ద జనసేన,టీడీపీ,బీజేపీ నాయకులు దీపాలు వెలిగించి బాణసంచా కాల్చారు.జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర, తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కాక సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్న శు భ సందర్భంలో ఒక పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమంకు తలపెట్టడం జరిగిందన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా ఆనందోత్సవాలతో సుపరిపాలనకు ఏడాది ఉత్సవం చేపడుతున్నామని తెలియజేశారు.ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చెప్పిన విధంగానే పెంచిన పింఛన్లు ఇవ్వడం జరుగుతుందని,అన్నా క్యాంటీన్లు ప్రారంభించడమే జరిగిందని,గ్రామీణ ప్రాంతాలలో సిమెంట్ రోడ్లు పూర్తయ్యాయని చెప్పారు.ఈ నెలలోనే తల్లికి వందనం కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, తరువాత అన్నదాత సుఖీభవ కార్యక్రమం కూడా చేపట్టబోతున్నామని మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతి కార్యక్రమం చేసి చూపెడతామన్నారు.ఈ కార్యక్రమంలో నాతవరం మండల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, నాతవరం మండల జనసేన అధ్యక్షులు వెలగల వెంకటరమణ, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు సబ్బి కుమారు స్వామి,జనసేన మండల నాయకులు పోలుపర్తి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు,నేతల విజయకుమార్, మాజీ ఎంపిటిసి అప్పిరెడ్డి మాణిక్యం, గ్రామ పార్టీ అధ్యక్షులు పైల సూరిబాబు, టిడిపి మండల యూత్ అధ్యక్షులు శెట్టి లోవ, మాజీ టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు శెట్టి నానాజీ, బిజెపి సీనియర్ నాయకులు పేరూరి రాయుడు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళ,యువత తన మొబైల్ ఫోనులో రక్షణగా శక్తి (ఎస్.ఓ.ఎస్) మొబైల్ యాప్



విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

**క్రైమ్ బ్యూరో పెన్ పవర్ విజయనగరం, జూన్ 4 :**మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి (ఎస్.ఓ.ఎస్) మొబైల్ యాప్ను ప్రతి మహిళ,యువత తన మొబైల్ ఫోనులో డౌన్లోడు చేసుకొని, తప్పనిసరిగా రిజిస్ట్రేషను చేసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూన్ 4న పిలుపునిచ్చారు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్నట్లేనన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ లోని ఎస్.ఓ.ఎస్. బటన్ ను ప్రెస్ చేసినట్లయితే క్షణాల్లో పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకొని, రక్షణగా
నిలుస్తారన్నారు. మహిళల భద్రతకు పోలీసుల సేవలను సులువుగా పొందేందుకు, వారికి అవసరమైన రక్షణ చట్టాలను, పోలీసు స్టేషను ఫోను నంబర్లు, మొబైల్ యాప్ నుండే ఫిర్యాదు చేసే అవకాశం, నైట్ షెల్టర్ల వివరాలను, ఫ్యామిలి కౌన్సిలింగు, సేఫ్ ట్రావెల్, వాట్సాప్ గవర్నెన్స్ సేవలను శక్తి మొబైల్ యాప్లో నిక్షిప్తం చేసి, మొబైల్ యాప్ను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిందని జిల్లా ఎస్పీ అన్నారు. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ప్రయాణించే యాప్ ని సేఫ్ ట్రావెల్ ను ఆన్ చేసుకొంటే, వారు సురక్షితంగా గమ్య స్థానంకు చేరుకొనే వరకు వారి ప్రయాణంపై పోలీసుశాఖ నిఘా పెడుతుందన్నారు. ఆపద సమయాల్లో సదరు మహిళలు పోలీసులకు సమాచారంను అందించలేని పరిస్థితుల్లో కూడా ఈ మొబైల్ యాప్ పని చేస్తుందన్నారు. అటువంటి సమయాల్లో కేవలం మొబైల్ ఫోనును గాలిలో షేక్ చేసినా, వారున్న లొకేషను, 10 సెకన్ల ఆడియో, వీడియోలు దగ్గరలో ఉన్న పోలీసు స్టేషనుకు చేరుతాయని,తద్వారా పోలీసులు సకాలంలో స్పందించి, కారకులైన వ్యక్తులపై చర్యలు చేపట్టి, వారికి రక్షణగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. కావున, ప్రతీ మహిళ, విద్యార్థిని స్వచ్ఛందంగా తమ మొబైల్ ఫోనులో తప్పనిసరిగా శక్తి యాప్ ను డౌన్లోడు చేసుకొని, రిజిస్ట్రేషను చేసుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. మహిళలు, విద్యార్థినులు తాము ఆపదలో ఉన్నామని భావిస్తే యాప్లో ని ఎస్.ఓ.ఎస్.బటన్ ప్రెస్ చేయాలన్నారు. రాత్రి సమయాల్లో మహిళలు నైట్ షెల్టర్లులో వేచి
ఉండేందుకు దగ్గరలో ఉన్న నైట్ షెల్టర్ల వివరా లు, సమీపంలోని పోలీసు స్టేషన్ల ఫోను నంబ ర్లు, హెల్ప్ ను నంబర్లు అందుబాటులో ఉంటా యని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. శక్తి బృందాలు జిల్లా వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలను, బస్టాండులు, ఆర్టీసి కాంప్లెక్సులు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్ళు, కళాశాలలు సందర్శించి, మహిళలు, విద్యార్థినులకు శక్తి మొబైల్ యాప్ పట్ల విస్తృతంగా
అవగాహన కల్పిస్తున్నామన్నారు.
ఈ బృందాలకు ఎస్ఐలు నాయకత్వం వహిస్తు న్నారని, శక్తి టీమ్స్ మఫ్టీలో వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ, మహిళలకు రక్షణగా నిలిచే చట్టా లు, యాప్ పనితీరు పట్ల అవగాహన కల్పిస్తు న్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, జూన్ 4 :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కల్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

# ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి.

**50 పడకల ఆసుపత్రిని ఎమ్మెల్యేతో కలిసి సందర్శించిన డిసిహెచ్ఎస్.**



**గుమ్మలక్ష్మీపురం జూన్ 4 పెన్ పవర్.**మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న భద్రగిరి 50 పడకల ఆసుపత్రిని జిల్లా హాస్పిటల్స్ కో-ఆర్డినేటర్ సర్వీసెస్ డాక్టర్ గొర్లి నాగభూషన్ బుధవారం నాడు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులను స్వయంగా వెళ్లి పరిశీలించారు. పనులు వేగవంతం పై వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆసుపత్రి వైద్యా సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొని సందర్శించారు.

# నేత్రపర్వంగా శ్రీ వరాహ లక్ష్మినృసింహస్వామివారి గరుడ సేవ





**సింహాచలం, పెన్ పవర్, జూన్ 4 :** శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి గరుడ సేవ నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని మండపంలో అధిష్టింపజేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# శ్రీ శృంగమణి పర్వతంపై వెంకన్న కళ్యాణోత్సవాలకు ముస్తాబు



**విశాఖ దక్షిణం పెన్ పవర్ జూన్ 4 :**పోర్టు ఏరియాలోని శ్రీ శృంగమణి పర్వతంపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరుక్క ళ్యాణ మహోత్సవాలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ముస్తాబైంది. జూన్ 6 నుండి 12వ తేదీ వరకు శ్రీవారి కళ్యాణ వేడుకలు ఘనంగా జరుగుతాయని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు తెలియజేశారు. స్వామివారి కల్యాణోత్సవం 7వ తేదీ సాయం త్రం 7గంటలకు జరుగుతుంది. 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ నిర్వహిస్తారు. 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పండిత గోష్టి మహదాశీర్వచన ఉంటుంది. 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు శ్రీ స్వామి వారి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో పైలెట్ లాంచీలో సముద్రంలో ఊరేగిస్తారు. 11వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు సముద్ర స్నానం,అన్నదానం ఉంటుంది సాయంత్రం 6 గంటలకు చోరోత్స వం,12వ తేదీ సాయంత్రం 6 గంటలకు పుష్పాంజలి సేవ ఉంటుంది. 22వ తేదీన 16రోజుల పండుగ పాలికా విసర్జనంతో ఉత్సవాలు ముగుస్తాయి. శ్రీ స్వామివారి కళ్యాణ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించాలని ఈఓ శ్రీనివాసరావు కోరారు. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభిస్తారు.

